ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024



ఉపాధిని వ్యవసాయానికి కలపండి..

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతు ఆదిరెడ్డి అధికారులను కోరారు. పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామ సభలో రైతు పాల్గొన్నారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతులకు ఆర్థికభారం తగ్గుతుందని అన్నారు. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నామని అధికారులకు తెలిపారు. సీసీ రోడ్లు, ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. - పెద్దవడుగూరు



ఆదిరెడ్డి రైతు, చింతల చెరువు

పల్లెవించిన సభలు

100 శాతం పంచాయతీల్లో నిర్వహణ

- ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై చర్చ
- ప్రజల నుంచి వినతులు, సూచనలు
- స్వర్ణ పంచాయతీల రూపకల్పనకు తొలి అడుగు
- హాజరైన ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23: గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. స్వర్ణ గ్రామ పంచాయతీ రూపకల్పన దిశగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఇందులో భాగమయ్యారు. ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి అంశాలను చర్చించారు. తొలి అంశం మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి కొళాయిలు, వంట గ్యాస్ కనెక్షన్లు, రెండో అంశం మురుగు నీటి వ్యవస్థ, ఘనవ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంట్ రహదారులు, మూడో అంశం గ్రామీణ రహదారుల నిర్మాణం, మండల కేంద్రాలకు లింకు రోడ్లు, నాలుగో అంశంగా ఇంకుడు గుంతల నిర్మాణం, ఉద్యాన, పట్టు పరిశ్రమ అభివృద్ధి, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణం గురించి చర్చించారు. ఏఏ గ్రామానికి ఏవి అవసరమో గుర్తించి.. అభివృద్ధి ప్రణాళికను రూపొందించి అమలు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 577 గ్రామ పంచాయతీలకుగానూ 576 గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పాపంపేట, నారాయణపురం గ్రామ పంచాయతీల సభలను కలిపి ఒకేచోట ఏర్పాటు చేశారు. తద్వారా వందశాతం పంచాయతీల్లో ఒకే రోజు సభలు నిర్వహించి మునుపెన్నడూ లేని ఘనతను సాధించారు.

డ్వామా నుంచి పర్యవేక్షణ

కలెక్టర్ ఆదేశాల మేరకు డ్వామా కాన్ఫరెన్స్ హాల్ నుంచి జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు బృందం గ్రామ సభలను పర్యవేక్షించింది. రోడ్లు బాగు చేయాలని, మురుగు కాలవల నిర్మించాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని, ఉపాధి పనులు విరివిగా కల్పించాలని ప్రజలు కోరారు. గార్లదిన్నె గ్రామ సభలో ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.







డ్వామా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి గ్రామ సభలను పర్యవేక్షిస్తున్న అధికారులు



ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

గ్రామసభల తీర్మానాలకు ప్రాధాన్యం: పరిటాల సునీత

రామగిరి: గ్రామ సభలలో చేసిన తీర్మానాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి.. అభివృద్ధి చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మాదాపురం గ్రామ సభకు ఆమె హాజరయ్యారు. సర్పంచ్ గంగమ్మ అధ్యక్షత వహించారు. గ్రామ సమస్యలను ప్రజల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తీర్మానం చేయించారు. వాటి పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. మాదాపురం నుంచి ఎలక్కుంట్ల, నరసంపల్లి, కొత్తగాదికుంట, గుడివాండ్లపల్లి గ్రామాలకు రోడ్లు వేయాలని ప్రజలు కోరారు. అనంతపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని, పండ్ల తోటల పెంపకానికి పది ఎకరాల వరకూ రాయితీ వర్తింపజేయాలని కోరారు. సీసీ రోడ్లు, వీధి దీపాలు, శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఏఓ వెంకటేశ్వరప్రసాద్, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

పంచాయతీలు బలోపేతం: కాలవ

రాయదుర్గం రూరల్: పంచాయతీలు బలోపేతంగా ఉంటేనే గ్రామాలు బాగుపడతాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం మండలం గ్రామదట్లలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో వీధి దీపాలు, సీసీ రోడ్లు, తాగునీటి కొళాయిల ఏర్పాటుకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో స్థాపించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ధ్యేయమని అన్నారు. ఉపాధిహామీ పథకం కింద గ్రామంలో ఏఏ పనులు అవసరమవుతాయో ప్రతిపాదన పంపి, మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

మహాత్ముడి మాటలే స్ఫూర్తి: అశ్మిత్

తాడిపత్రి: గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న గాంధీజీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామాలను అభివృద్ధి చేసి చూపుతామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. గన్నెవారిపల్లికాలనీ గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. సీసీ రోడ్లు లేని గ్రామాలను గుర్తించే పనిలో ఉన్నామని తెలిపారు. గన్నెవారిపల్లికాలనీలో భూగర్భ మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతాయని అన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, ఉప సర్పంచ్ పావని, తహసీల్దారు ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

ఇక గ్రామ స్వరాజ్యం: దగ్గుపాటి

అనంతపురం రూరల్: జగన్ పాలనలో పంచాయతీలకు నిధులు లేక సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. అనంతపురం రూరల్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. సర్పంచు ఉదయ్‌శంకర్ అధ్యక్షత వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. సీఎం చంద్రబాబు గ్రామ స్వరాజ్యానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ నాశనమైందని విమర్శించారు. బ్లీచింగ్ పౌండర్ చల్లేందుకు కూడా నిధులు ఇవ్వలేదని అన్నారు. గ్రామ స్వరాజ్య స్థాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. సభలో వీర మహిళ రాయలసీమ అధ్యక్షురాలు పెండ్యాల శ్రీలత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి లలిత్‌కుమార్, అర్బన్ తహసీల్దారు హరికుమార్, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీ, టీడీపీ నాయకులు జయరాం నాయుడు, రాయల్ మురళి, సుధాకర్ నాయుడు, గంగారామ్, కృష్ణకుమార్, సరిపూటి రమణ, తెలుగుయువత నాయకులు లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో అభివృద్ధి: శ్రావణి

పుట్లూరు: గ్రామస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. కడవకల్లులో నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ గ్రామస్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని తెలిపారు. ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. రహదారుల మరమ్మతు సహా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ యోగానంద రెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, వేణు, పెద్దయ్య, రాజేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



బసినేపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

సమస్యల పరిష్కారానికే: వెంకటశివుడు యాదవ్

గుత్తి రూరల్: గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. బసినేపల్లిలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, పొలాల రహదారికి మరమ్మతులు, విద్యుత్ సమస్యలపై ప్రజలు అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, బర్డీ వలి, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల సమస్యపై..



బెణికల్లు క్రాస్‌లోని గురుకుల పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలబడుతోంది. దోమలు ప్రబలుతున్నాయి. సమస్యను పరిష్కరించి రోగాలు వ్యాపించకుండా చూడాలి.

- గంగాధర, హిందీ టీచర్, కణేకల్లు

చేతి పంపులు వేయించాలి



మా కాలనీలో చేతిపంపులు లేవు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. కనీసం రెండు చేతిపంపులైనా వేయించాలి. కూటమి ప్రభుత్వం మా సమస్యలను ఖచ్చితంగా పరిష్కరిస్తుందని భావిస్తున్నాను.

- లాలెప్ప, సంజయ్‌నగర్, కణేకల్లు

స్ఫూర్తిప్రదాత టంగుటూరి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



టంగుటూరికి నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం టౌన్/క్రైం, ఆగస్టు 23: స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగలించిన స్ఫూర్తి ప్రదాత టంగుటూరి ప్రకాశం పంతులు అని ఇన్‌చార్జి కలెక్టరు శివనారాయణ శర్మ కొనియాడారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం టంగుటూరి జయంతి వేడుకలను నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నార్పల కేజీబీవీ, అనంతపురం బీసీ వసతిగృహం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం టంగుటూరి చేసిన పోరాటాలను ఇన్‌చార్జి కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుభాషిణి, కలెక్టరేట్ ఏఓ మారుతి తదితరులు పాల్గొన్నారు.

యోధుడు ప్రకాశం: ఎస్పీ

దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమించిన యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎస్పీ జగదీష్ అన్నారు. డీపీఓలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించారని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా సేవలు అందించారని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు టీవీవీ ప్రతాప్, రవి కుమార్, సీఐలు ధరణికిషోర్, కనుమూరి సాయినాథ్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐలు రాముడు, మధు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ పేరిట సైబర్ మోసాలు జరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు ఎస్పీ జగదీష్ సూచించారు. విదేశాల నుంచి మాట్లాడుతున్నామని, ఫెడ్ ఎక్స్ నుంచి కొరియర్ వచ్చిందని అపరిచితులు మోసగిస్తున్నారని తెలిపారు. కొరియర్‌లో డ్రగ్స్, పేలుడు పదార్థాలు ఉన్నాయని పోలీసుల పేరిట భయపెడతారని, డేటా సేకరించి సొమ్ము కాజేస్తారని అన్నారు. వారు నకిలీ పోలీసులు అని, నిజమైన పోలీసులు వాట్సాప్ కాల్స్ చేయరని వివరించారు. అనుమానం కలిగితే స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.

చాగల్లు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపప్పూరు, ఆగస్టు 23: చాగల్లు రిజర్వాయర్‌కు భారీగా నీరు చేరింది. దీంతో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గండికోట రిజర్వాయర్ వైపు వరద నీరు పరుగులు పెడుతోంది. రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌కు వరద పెరిగింది. దీంతో ఎమ్మెల్యే గంగమ్మకు పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు.

కాసులివ్వందే కదలరు..!

- ఎంపీడీఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి హవా
- వైసీపీ హయాంలో మరో అధికారితో కలిసి అక్రమాలు



కంబదూరు మండల పరిషత్ కార్యాలయం ఇదే

కళ్యాణదుర్గం, ఆగస్టు 23: కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో ఓ ఉద్యోగికి కాసులిస్తేనే ఫైళ్లు కదులుతున్నాయి. ఉన్నతాధికారి ఉన్నా.. ఆయన ఆదేశాలను పెద్దగా పట్టించుకునేవారు లేరు. కానీ ఆ ఉన్నతాధికారి కింద పనిచేసే ఉద్యోగి చెబితే.. నిమిషాలల్లో పనులు జరిగిపోతాయి. రెండున్నరేళ్లుగా ఆ కింది స్థాయి అధికారి హవా నడుస్తోంది. ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించి.. భారీగా డబ్బులు దండుతున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగారు. నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ అధికారి, ఈ కింది స్థాయి అధికారి కలిసి నిధులను స్వాహా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూ అర్బన్ మిషన్‌లో భారీగా అవినీతికి పాల్పడ్డారు. జలజీవన్ మిషన్ నిధులు, ఆర్థిక సంఘం నిధులతో పాటు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పథకం నిధులను ఇష్టారాజ్యంగా వాడుకున్నారనే అభియోగం వీరిపై ఉంది. చేసిన పనులకు సంబంధించిన ఎం బుక్‌లను కూడా మాయం చేశారు. దుర్వినియోగం చేసిన నిధులపై సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. ప్రభుత్వం మారినా ఆ కార్యాలయంలో కిందిస్థాయి అధికారి హవానే నడుస్తోంది. ఉన్నతాధికారి అక్రమాల గురించి పట్టించుకోవడం లేదు. జల జీవన్ మిషన్ నిధుల్లో పంచాయతీ కార్యదర్శులతో ఆ కింది స్థాయి అధికారి కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకంలో భాగంగా కోట్లాది రూపాయల పనులు జరిగాయి. విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసినప్పుడు చేసిన పనులకు... ఎంబుక్ రికార్డుల నమోదుకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. వైసీపీ నాయకుల అండతో ఆ అవినీతి బయటకు పొక్కకుండా చేశారనే ఆరోపణలున్నాయి.

కలెక్టర్ స్పందించాలి..



కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే కింది స్థాయి అధికారి అవినీతిపై పూర్తి ఆధారాలతో జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశాం. నిధులు ఎలా దుర్వినియోగమయ్యాయన్న విషయాలను ఆధారాలు అందజేశాం. నిధులను దుర్వినియోగం చేయడంతో మండలంలో అభివృద్ధి అటకెక్కింది. కలెక్టర్ స్పందించి ఆ అధికారి అవినీతిపై నిగ్గుతేల్చాలి.

- చక్రవర్తి, బీజేపీ మండల కన్వీనర్, కంబదూరు

రండి.. మాట్లాడుకుందాం..!

జూడాలకు సూపరింటెండెంట్ పిలుపు



పెద్దాస్పత్రి ఆవరణలో రిలే దీక్షలు చేస్తున్న జూడాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 23: కోల్‌కతా మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా జూడాలు ఆందోళన కొనసాగిస్తున్నారు. పది రోజులుగా విధులను బహిష్కరిస్తున్నారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు వారిని శుక్రవారం చర్చలకు ఆహ్వానించారు. జూడాలకు భద్రతకు చర్యలు తీసుకుంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి సీనియర్ వైద్యులు డాక్టర్ భీమసేనాచారి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ రామస్వామితో కమిటీ ఏర్పాటు చేశామని జూడాలకు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకులతో మాట్లాడి చర్చలపై నిర్ణయం తీసుకుంటామని జూడాలు తెలిపారు. జూడాల ఆందోళన నేపథ్యంలో ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. భద్రత, వసతి గురించి సూచనలు చేశారు. సీసీ కెమెరాలు, వీధి దీపాలు, రెస్ట్ రూంలలో వసతులపై ఇంజనీరింగ్ అధికారులతో సూపరింటెండెంట్ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ ఆస్పత్రిలో భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో జూడాల నిర్ణయం ఎలా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.

ఉద్దరగా కొట్టేద్దామని..!

- అగ్రిగోల్డ్ భూమి ఆక్రమణకు వైసీపీ నాయకుడి యత్నం
- ప్రధాన రహదారి పక్కనే కంపచెట్లు తొలగింపు
- వెంచర్‌లోని విలువైన సామగ్రి తరలింపు



అగ్రిగోల్డ్ భూమిని శుభ్రం చేసిన దృశ్యం

కూడేరు: మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూమిని ఆక్రమించుకోవడానికి ఓ వైసీపీ నాయకుడు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. బ్రహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో 221.45 ఎకరాల్లో అగ్రిగోల్డ్ సంస్థ వెంచర్ ఉంచి. ఈ భూమి మొత్తం కోర్టు పరిధిలో ఉంది. దీన్ని కబ్జా చేసేందుకు వైసీపీ పాలనలోనే ఆ పార్టీ నాయకులు కొందరు ప్రయత్నించారు. అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న వెంచర్‌లో కల్యాణ మండలం షెడ్డుతోపాటు వంటశాల షెడ్డుకున్న సామగ్రిని మాయం చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న వైసీపీ నాయకుడిని అగ్రిగోల్డ్ భూములపై కన్నుపడటంతో రెండు నెలల కిందట వెంచర్ చుట్టూ, లోపల, బయట కంపచెట్లు తొలగించాడు. ఇంతటితో ఆగకుండా ప్రహరీని ధ్వంసం చేశారు. కోర్టు పరిధిలోనున్న భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం మౌనంగా ఉన్నారు.

విలువైన భూమిపైనే కన్ను....

అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భూమి ఎకరం రూ.రెండుకోట్ల వరకు ధర పలుకుతోంది. ఇంత విలువైన భూమిపై వైసీపీ నాయకుడికి కన్ను పడటంతో దాదాపు రెండు ఎకరాల వరకు కంపచెట్లు తొలగించారు. వైసీపీ పాలనలో కొందరు రియల్టర్లు కోట్లు విలువైన అసైన్డ్ భూములను తక్కువ ధరలకే కొట్టేశారు. వాటిని రిజిస్ట్రేషన్ చేసి, వెంచర్లు వేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అగ్రిగోల్డ్ భూములను స్వాధీనం చేసుకోవడానికి కంపచెట్లు తొలగించి కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చే విధంగా ఎత్తుగడ వేసినట్లు సమాచారం. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దారు విశ్వనాథ్‌ను అడగ్గా కోర్టు పరిధిలోని అగ్రిగోల్డ్ భూములను శుభ్రం చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని, సంబంధిత వ్యక్తులను రికార్డులుంటే తీసుకురావాలని చెప్పామని, ఇంత వరకు వారు రాలేదన్నారు.



మాట్లాడుతున్న దామోదర గౌరంగదాస్

26 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 23: నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర గౌరంగదాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఇస్కాన్ మందిరం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న దర్శన హారతి, గురుపూజ, యజ్ఞసేవ, 26న హరినామ సంకీర్తన, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టడం, 5 గంటలకు గరుడవాహన సేవ, 6 గంటలకు తెప్పోత్సవం, 7 గంటలకు ఊంజల్ సేవ, 27న ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంత శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావోత్సవం సందర్భంగా మహాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇస్కాన్ మందిర సభ్యుడు శ్రీకృష్ణమాధవదాస్ పాల్గొన్నారు.

5 నుంచి వాటర్‌వర్క్స్ కార్మికుల సమ్మె



డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న వాటర్ వర్క్స్ యూనియన్ల నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 23: శ్రీరాంరెడ్డి, సత్యసాయి తాగునీటి సరఫరా పథకాల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 5 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు ఆరునెలలుగా రావాల్సిన వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటివి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబరు 5 నుంచి సమ్మె చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, రాము, అశోక్, వీరయ్య, నరేష్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీని ఆధునికీకరించాలి: సీపీఐ

అనంతపురం విద్య, ఆగస్టు 23: జిల్లాకు సాగు, తాగునీటిని అందించే హెచ్చెల్సీని రాష్ట్ర సరిహద్దు నుంచి ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ డిమాండ్ చేశారు. ఇందుకోసం రూ.500 కోట్లను కేటాయించాలన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిచ్చిమొక్కలు, పూడికతో హెచ్చెల్సీ అధ్వానంగా మారిందన్నారు. దీంతో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయి, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కనీసం 4 వేల క్యూసెక్కులు ప్రవహించేలా పనులు చేయాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యాం ఎత్తును 2023లో ఒక అడుగు పెంచారని, దీంతో 10 నుంచి 15 టీఎంసీలు నీటి నిల్వ సామర్థ్యం పెరిగిందన్నారు. పెరిగిన నీటి నిల్వ నేపథ్యంలో ఆంధ్రాకు రావాల్సిన వాటాకు అనుగుణంగా పంపకాలు పెంచాలని కోరారు.

తెలివిగా టోకరా!

- అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పిస్తానని మోసం
- విడతల వారిగా రూ.2.8 లక్షలు వసూలు
- అడిగితే బాధితురాలిని బెదిరిస్తున్న లీడర్ కం టీచర్
- చోద్యం చూస్తున్న ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులు



ఐసీడీఎస్ కార్యాలయం

అనంతపురం విద్య, ఆగస్టు 23: పోస్టు ఇప్పిస్తానని చెప్పి ఓ యూనియన్ లీడర్ అంగన్‌వాడీ లబ్ధిదారుతో విడతల వారిగా రూ. లక్షలు లాగేసింది. రోజులు గడిచినా చెప్పిన పోస్టు రాకపోవడంతో ఆ లబ్ధిదారులు ఆందోళన చెందింది. తన డబ్బులు ఇవ్వమని అడిగితే ఇచ్చేది లేదు ఏం చేసుకుంటావో చేసుకో అంటూ ఆ లీడర్ బెదిరించింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన లబ్ధిదారురాలు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసు విచారణలో సైతం యూనియన్ లీడర్ లక్షలు వసూలు చేసినట్లు తేలిందని సమాచారం. ఫిర్యాదులు ఎక్కువ కావడంతో ఆ లీడర్‌ను యూనియన్ నుంచి గెంటేశారు. అయితే ఐసీడీఎస్ శాఖలోని ఉన్నతాధికారులు మాత్రం తమకు ఏం తెలీదన్నట్లుగా చోద్యం చూస్తున్నారు.

సెల్ఫ్ డబ్బాతో టోపీ...!

నగరంలోని పాతూరులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలోని ఓ తల్లి తన పిల్లలను సెంటర్‌కు పంపేది. ఆ సెంటర్‌లో పనిచేసే అంగన్‌వాడీ టీచర్, యూనియన్ లీడర్‌గా చెప్పుకుంటూ తల్లిని పరిచయం చేసుకుంది. తనకు సీఐటీయూలో మంచి గ్రిప్ ఉందంటూ సెల్ఫ్ డబ్బా కొట్టుకుంది. నా సెంటర్‌లోనే అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పిస్తానని, కొంత ఖర్చు అవుతుందని, డబ్బులు సరిచేసుకోవాలని యూనియన్ లీడర్ ఆ తల్లికి సూచించింది. దీంతో పోస్టు పక్కా అనుకుని ఆ అమాయక లబ్ధిదారురాలు కొంత డబ్బు జమ చేసుకుంది. ఈ లోగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రావడంతో ఆమె 2022 సెప్టెంబరులో అదే సెంటర్‌లో ఆయా పోస్టుకు దరఖాస్తు చేసింది. ఆ రోజే యూనియన్ లీడర్ మాయమాటలు చెప్పి రూ.లక్ష తీసుకుంది. లబ్ధిదారురాలు అదృష్టం కొద్దీ ఆయా పోస్టు వచ్చింది. టీచర్ పోస్టు నీకు కచ్చితంగా ఇప్పిస్తా, మరికొంత డబ్బు సర్దుబాటు చేయమని ఆమెకు చెప్పింది. 2022 సెప్టెంబరు చివరి వారంలో ఆయా పోస్టు ఉత్తర్వులు తీసుకునే రోజునే రూ. 1.8 లక్షలు ఆమె నుంచి యూనియన్ లీడర్ లాగేసింది.

యూనియన్ నుంచి గెంటివేత

యూనియన్ లీడర్ వసూళ్ల బాగోతం సీఐటీయూ నాయకులకు తెలియడంతో ఆమెను యూనియన్ నుంచి బయటకు గెంటేశారు. ఎవరైనా అడిగితే నేనే బయటకు వచ్చా అంటూ చెప్పుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో టీచర్ పోస్టు కోసం డబ్బులిచ్చిన ఆయా తన సొమ్ము అడిగితే 'వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ లేదా టీడీపీ ట్రేడ్ యూనియన్‌లో చేరుతా. ఎన్నికలు పూర్తి కాగానే ఏ ప్రభుత్వం వచ్చినా నీ పని అవుతుంది' అంటూ నమ్మబలికింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా పోస్టు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన ఆ ఆయా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది.

చర్యలు ఏవీ...?

యూనియన్ లీడర్ కం అంగన్‌వాడీ టీచర్‌పై బాధితురాలు ఈనెల 5న కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. తన నుంచి రూ. 2.8 లక్షలు తీసుకుని మోసం చేసిందని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో కలెక్టరేట్ అధికారులు ఇది చీటింగ్ కేసు అంటూ జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు పంపారు. అక్కడ ఫిర్యాదు చేయడంతో వాళ్లు నగరంలోని వన్‌టౌన్‌కు సిఫార్సు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఆ టీచర్ డబ్బులు లాగేసినట్లు గుర్తించారు. కేసు వరకూ ఎందుకు? తీసుకున్న డబ్బులు ఆమెకు తిరిగి ఇచ్చేయండి అంటూ ఆ టీచర్‌కు పోలీసులు చెప్పినా ఆమె ససేమిరా అన్నట్లు తెలిసింది. కేసు పెట్టుకోండి అంటూ ఆ టీచర్, మాజీ యూనియన్ లీడర్ బింకాలు పోతున్నట్లు సమాచారం. అయితే ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ ఆఫీస్ ఉన్నతాధికారులు ఈ ముడుపుల బాగోతంపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గ్రామసభలో టీడీపీ నాయకుడిపై దాడి

బాధితుడిని ఫోన్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే శ్రావణి



దాడిలో గాయపడ్డ భైరవేశ్వర్

యల్లనూరు, ఆగస్టు23: మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు భైరవేశ్వర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దిలీప్‌రెడ్డి, పెద్దిరెడ్డితోపాటు మరికొంతమంది శుక్రవారం దాడి చేశారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన గ్రామసభలను నిర్వహించారు. వెన్నపూసపల్లిలో నిర్వహించిన గ్రామసభలో టీడీపీకి చెందిన భైరవేశ్వర్ గ్రామంలో పనులకు సంబంధించిన వాటిని నమోదు చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ మాబుకు తెలియజేశారు. అయితే మాబు వాటిని నమోదుచేయకుండా వైసీపీ నాయకులు చెబుతున్న పనులను నమోదు చేస్తుండడంతో ఇదేమిటని భైరవేశ్వర్ ప్రశ్నించాడు. దీంతో వైసీపీ నాయకులు భైరవేశ్వర్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలోనే భైరవేశ్వర్‌పై వైసీపీ నాయకులు దాడికి దిగారు. దీనిపై భైరవేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి బాధితుడు భైరవేశ్వర్‌కు ఫోన్ చేసి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల తీరుపై మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కాగా అత్యంత సమస్యాత్మక గ్రామమైన వెన్నపూసపల్లిలో గ్రామసభ జరుగుతున్నా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఎందుకు ఏర్పాటు చేయలేదన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామసభలకు టీడీపీ, వైసీపీ వర్గాలకు చెందిన వారు హాజరవుతారని తెలిసినా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఎంపీడీఓ అత్యుత్సాహం..!

గ్రామసభకు వైసీపీ నేత అధ్యక్షత

డీ.హీరేహాళ్, ఆగస్టు 23: మండలంలోని మలపనగుడిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామసభకు వైసీపీ మండల కన్వీనర్ ఎలా అధ్యక్షత వహిస్తారని టీడీపీ నాయకులు, ఎంపీడీఓ రఘుతో వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. మలపనగుడి పంచాయతీలో కూడా ఆయా శాఖలకు సంబంధించిన అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ వద్దకు వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి రాగానే ఎంపీడీఓ రఘునాథ్ ఆయనను ఆహ్వానించి సభకు అధ్యక్షత వహించాలని కోరారు. దీనికి టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇదేమైనా వైసీపీకి సంబంధించిన సభ లేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామసభనా అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు మాత్రమే సభకు అధ్యక్షత వహించే విధంగా చర్యలు చేపట్టాలని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు కాసేపు మాటల యుద్ధం జరిగింది. ఇది తీవ్రస్థాయికి చేరడంతో వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి గ్రామ సభ నుంచి వెళ్లిపోయారు.

ఆవిష్కరణలకే పట్టం: ఎస్కేయూ వీసీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: గ్రామీణ, చిన్నపట్టణ ప్రాంతాల్లో పారిశ్రామిక ఔత్సాహికులను ప్రోత్సహించేలా సాధికారత ఆవిష్కరణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టం కడుతున్నాయని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో సాధికారత ఆవిష్కరణల వేడుకలు ప్రారంభించారు. వీసీ అనిత మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఆశాజనకమైన ఔత్సాహికులకు అవసరమైన వనరులను సమకూరుస్తామన్నారు. కొత్త వ్యాపారాలకు మద్దతిచ్చి విజయం సాధించేలా స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్‌చేసి సరికొత్త మైలురాయిని అధిగమించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా వాటికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగభూషణరాజు, మేనేజర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

వీసీకి క్లాస్‌మేట్స్ సన్మానం

వీసీ అనితను ఆమె క్లాస్‌మేట్స్ కలిసి సన్మానించారు. 1980లో పామిడి ప్రభుత్వ పాఠశాలలో వీసీ అనిత పదో తరగతి అభ్యసించారు. తరగతి స్నేహితులైన ఐపీఎస్ సాయిమనోహర్ తదితరులు వారి పాఠశాల స్మృతులను గుర్తుచేసుకుని వీసీని అభినందించారు.

కృత్రిమ మేధస్సుతో సాంకేతిక అభివృద్ధి

- ఐఐఎస్‌టీ సైంటిస్ట్ మనోహర్



కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: సాంకేతిక అభివృద్ధిలో కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ అండ్ సైన్స్ టెక్నాలజీ(ఐఎస్ఎస్‌టీ) సైంటిస్ట్ డాక్టర్ మనోహర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సెంట్రల్ యూనివర్సిటీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, మనోహర్‌కుమార్ హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయం, అడవులు, పట్టణ విస్తరణ, వాతావరణం పరిరక్షణకు రిమోట్ సెన్సింగ్ ఎంతో ఉపయోగ పడుతోందన్నారు. మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్ కోర్సులు రిమోట్ సెన్సింగ్‌లో అకాశాలను కల్పిస్తుందని తెలిపారు. అంతరిక్షంలోకి రాకెట్లను పంపడం నుంచి చంద్రుడిపై ల్యాండ్ అయ్యేంత వరకు భారత సాంకేతిక పరివర్తనకు కృత్రిమ మేధస్సు నిదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా అయ్యవార్లు మాకే కావాలి

కెంచెంపల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



ప్లకార్డులతో నిరసన చేపట్టిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు

కుందుర్పి, ఆగస్టు 23: 'సార్...! మా అయ్యవార్లు మాకే కావళ్ల. వాళ్లను ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయొద్దు' అని మండలంలోని కెంచంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ పాఠశాలలో పని చేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలలకు బదిలీ చేశారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కొండల మధ్య ఉన్న గ్రామంలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 92 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠాలు చెప్పేందుకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉండేవారు. అందులో ముగ్గురిని సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలలకు బదిలీ చేశారు. దీంతో తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్దుబాటును ఆపి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇక్కడే కొనసాగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

అవనికి మేఘాల ఛత్రం





అవనిపై అంబరానికి ఎప్పుడూ అంతులేని అనురాగమే..! అందుకే కాబోలు అప్పుడప్పుడు భానుడి కిరణ తీక్షత నుంచి ఉపశమనం కలిగించడానికి అన్నట్లు మేఘాల ఛత్రం పంపుతుంటుంది. పైన కనిపిస్తున్న ఆకాశవీధిలో వెండి మబ్బుల ఫొటో అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటికి చిక్కింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నాగేంద్ర (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 23: విద్యుదాఘాతంతో మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన రైతు వడ్డే నాగేంద్ర(26) శుక్రవారం తన పొలంలోనే మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాగేంద్ర కొండల్లో రాళ్లు కొట్టే వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాళ్లు కొట్టుకుని వచ్చి సాయంత్రం పొలం చూసేందుకు వెళ్లాడు. అక్కడ మోటారు వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీసు వైరు ఇనుప కంచెపై పడింది. దాన్ని గమనించకుండా నాగేంద్ర కంచెను దాటే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో కంచె అతడి చేతికి తగిలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలాడు. స్థానికులు గమనించి వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య పవిత్రతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23: ఉత్తమ క్రీడా అవార్డులకు అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం ఆగస్టు 29న శాప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు అవార్డు అందజేస్తామన్నారు. జాతీయ స్థాయిలో అసోసియేషన్లు, ఖేలో ఇండియా, యూనివర్సిటీ, స్కూల్ గేమ్స్‌లో రాణించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఈనెల 27లోపు అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-315632ను సంప్రదించాలని కోరారు.

జీడిపల్లిలో 1.097 టీఎంసీల నిల్వ

బెళుగుప్ప, ఆగస్టు 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ శుక్రవారానికి 1.094 టీఎంసీలకు చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 955 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు చెప్పారు.

26 వరకు ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: ఐటీఐ కళాశాల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఈ నెల 26వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వారి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకున్న విద్యార్థులకు 29న ప్రభుత్వ, 31న ప్రైవేట్ కళాశాలలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, ఆగస్టు 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.ఆరు పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 263 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మిద్దె కూలి నలుగురికి గాయాలు

ఉరవకొండ, ఆగస్టు23: మిద్దెకూలి నలుగురు గాయపడిన సంఘటన వజ్రకరూరు మండలంలోని బోడిసానిపల్లి గ్రామంలో జరిగింది. గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిద్దె బాగా నానడంతో కుప్పకూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న భార్యభర్తలు రాజేష్, భాగ్యమ్మలతో పాటు వారి తల్లి పార్వతి, బంధువులైన వన్నూరుస్వామికి గాయాలు అయ్యాయి. వారు కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని 108వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా పక్క గదిలో ఉన్న రాజేష్, భాగ్యమ్మల కుమార్తెకు తృటిలో ప్రమాదం తప్పింది.

అంజన్న సన్నిధిలో ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ అథారిటీ చైర్మన్



స్వామివారికి పూజలు చేస్తున్న జస్టిస్ గంగారావు

గుంతకల్లు, ఆగస్టు 23: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏపీ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ అథారిటీ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు శుక్రవారం ఉదయం పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి సన్నిధిలో నామార్చనలు చేయించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, స్వామి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మల్లికార్జున, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కసాపురం ఆలయంలో భక్తులకు అన్నదానం చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ఎస్ వెంకటరాముడు జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు ఎస్ నాగాంజనేయులు, రూ.99,999లు ఆలయ సూపరింటెండెంటు వెంకటేశులుకు అందజేశారు.
- బళ్లారి నగరానికి చెందిన కే శ్రీనివాస ప్రసాద్ స్మృత్యర్థం ఆయన సతీమణి సులోచనబాయి రూ.50వేలను ఏఈఓ మల్లికార్జునకు అందజేశారు. వితరణకర్తలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పెరగాలి

- జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు



ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. వర్సిటీ ఆవిర్భావ దినోత్సవాలను శుక్రవారం ఓటీపీఆర్ఐలో వీసీ సుదర్శన రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను తీసుకున్నవారు మానసిక స్థితిని కోల్పోయి అనారోగ్యానికి గురవుతారన్నారు. అదేవిధంగా ప్రమాదకర చర్యలకు పాల్పడతారని తెలిపారు. అందుకే వర్సిటీ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీ టు వీసీ దేవన్న, డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ స్వరూపరాణి, ప్రిన్సిపాల్ గోపినాథ్, ఏఆర్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాలు అధిగమిస్తేనే విజయాలు

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు



విద్యార్థులతో ప్రొఫెసర్‌లు వెంకటరావు, నారాయణరెడ్డి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: వ్యాపారాల్లో ఒడిదుడుకులు, సంక్షోభాలను అధిగమించిన సంస్థలే విజయాలబాటలో పయనిస్తాయని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ మేనేజ్‌మెంట్ విభాగంలో యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణరెడ్డి అధ్యక్షతన 'బిల్డింగ్ రెజిలెన్స్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్' అనే అంశంపై విద్యార్థులకు సెమినార్‌ను నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న వెంకటరావు వ్యాపార సంస్థల సుస్థిరాభివృద్ధి, మెలకువలు తదితర అంశాలపై సెమినార్ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు హుస్సేన్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేమన సాహితీయాత్ర

వివిధ రాష్ట్రాల నుంచి 50మంది కవుల రాక

పెనుకొండ, ఆగస్టు 23: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వేమన సాహితీయాత్ర నిర్వహిస్తామని జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. ఈ యాత్రలో వివిధ రాష్ట్రాల నుంచి 50మంది కవులు పాల్గొంటారన్నారు. ఈ సాహితీయాత్ర కదిరి నుంచి ప్రారంభమై వేమన సమాధి ఉన్న కటారుపల్లికి చేరుకుంటుందన్నారు. అక్కడ 25మంది కవులతో వేమన సాహితీవేదిక నిర్వహిస్తామన్నారు. తర్వాత తిమ్మమ్మ మర్రిమాను వద్దకు చేరుకుని మరో 20మంది కవులతో సమ్మేళనం నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం కృష్ణదేవరాయల సన్మానసభలో 50మంది కవులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహితీ అకాడమీ గ్రహీత చదువులబాబు, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, తెలుగుభాష శాఖ అధ్యక్షులు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు రజిత హాజరవుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


తమలపాకుల అలంకారంలో దర్శనమిస్తున్న నిమిషాంబదేవి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 23: శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని చెరువుకట్టపై వెలసిన నిమిషాంబదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతోపాటు తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకుడు రమేష్, భక్తులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, ఆగస్టు 23: మండలంలోని కుంటిమద్ది గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, వాల్మీకులు, గ్రామస్థులు కలిసి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. కొన్ని అనివార్యకారణాల వల్ల ప్రతిష్ఠ ఆగిపోవడంతో ప్రస్తు తం ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసి మరోసారి వాల్మీకి ఉత్సవ వేడుకలను ని ర్వహించనున్నట్లు తెలిపారు. వాల్మీకి జీవితం అందరికి ఆదర్శమని, ఆయ న ఆనాడు రామాయణాన్ని రచించి ప్రజలందరి మనస్సులో నిలిచిపోయారన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


ఓబుళాపురంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

గార్లదిన్నె, ఆగస్టు 23: పంటలు సాగుచేసిన ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం ఓబుళాపురం గ్రామంలో ఆముదం పంటను వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగుచేసిన రైతులందరు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 27,527 ఎకరాలలో వివిధ పంటలను రైతులు సాగుచేశారన్నారు. 5832 మంది రైతుల మాత్రమే ఈ-పంట నమోదు చేయించారని మిగిలిన వారు కూడా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎంపీఈఓ లలిత, వీఆర్వో గోపాల్‌రెడ్డి, సర్వేయర్ గణేష్, బాబాఫక్రుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి


రోగులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గార్లదిన్నె, ఆగస్టు 23: వైద్యులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు మెరుగైన వైద్య సేవలందించాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. శుక్రవారం గ్రామసభలో పాల్గొన్న అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజూ ఎంత మంది రోగులు వస్తున్నారు, ఏ విధమైన పరీక్షలు చేస్తున్నారు, ఎన్ని రకాల మందులు ఉన్నాయి, కేంద్రంలో ఇప్పటి వరకు ఎన్ని ప్రసవాలు చేశారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, వైద్యాధికారులు గౌతమి, హనీష, మంజుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించండి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 23: సచివాలయ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఏపీజీఎల్ఐ పాలసీలోని సమస్యలు పరిష్కరించాలని ఏపీజీఎల్ఐ జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ పుష్పావతిని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు ఏ. శివశంకర్, హనుమంతు, మహేష్ వినతి పత్రం అందజేశారు. పాలసీలో నామినీ వివరాలు నమోదు చేయకపోవడంతో పాలసీ క్లైమ్‌ల విషయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లోని 34 మంది పాలసీ బాండ్లను తక్షణమే జనరేట్ చేయాలన్నారు. నాయకులు రామాంజనేయులు, చిరంజీవి, భగీరథరెడ్డి, సుధాకర్, శివశంకర్, ఖాజా, అనిల్, కవిత పాల్గొన్నారు.

బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేయండి



ఎమ్మార్సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శింగనమల. ఆగస్టు 23: మండల కేంద్రంలో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టి ఎంఈఓకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బాలికల వసతి గృహం ఉండేదని, కొన్ని కారణాలవల్ల అనంతపురానికి తరలించారన్నారు. నూతనంగా నిర్మించిన వసతి గృహంలో ఎమ్మార్సీ భవనం నిర్వహిస్తున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు.

దోమల నియంత్రణకు డ్రోన్ స్ప్రే

అనంతపురం క్రైం, ఆగస్టు 23: నగరంలో దోమల నియంత్రణ కోసం డ్రోన్ స్ప్రే చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. శుక్రవారం ఓ ఏజెన్సీకి సంబంధించి డ్రోన్ మిషన్‌ను నగర కమిషనర్ పీవీవీఎస్ మూర్తి పరిశీలించారు. సూర్యానగర్‌లోని మరువ వంకపై స్ప్రే చేయించారు. ఎంత ద్రవాన్ని ఎన్ని కిలోమీటర్లు స్ప్రే చేయవచ్చనే వివరాలను కమిషనర్ ఆరా తీశారు.

క్రమశిక్షణతో విద్యార్థులు ముందుకెళ్లాలి


సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

రామగిరి, ఆగస్టు 23: విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని, అప్పుడే ఉన్నతశిఖరాలకు ఎదుగుతారని బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆర్ఎం వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పేరూరు ఉన్నతపాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషకాన్ని అందించారు. 10 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆర్ఎం తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం కల్యాణి, విశ్వాస్ అగ్రోస్ ఏజెన్సీ విశ్వనాథ్, బయోస్టాడ్ ఫీల్డ్‌స్టాఫ్ నారాయణ, మురళి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

- గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తాం
- ఎమ్మెల్యే పరిటాల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ధర్మవరం రూరల్(కనగానపల్లి), ఆగస్టు 23: పంచాయతీల నిధులను దారిమళ్లించిన గజ దొంగ వైఎస్ జగన్ అని, వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. ముత్తవకుంట్ల గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలను ప్రజలు వినతుల రూపంలో ఇవ్వాలన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సభల్లో గుర్తించి తీర్మానం చేసిన సమస్యలను రానున్న రోజుల్లో విడతలవారిగా పనులు చేపడతామన్నారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలకు చెందాల్సిన రూ.13 వేల కోట్లు దారిమళ్లించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తారన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు మంజూరైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని రైతు సంజీవరాయుడు పొలంలో మామిడి మొక్కలు నాటారు. అనంతరం వర్షానికి దెబ్బతిన్న టమోటాను పరిశీలించారు. రైతు రమేష్‌తో పంట నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, సర్పంచ్ రామాంజి, ఎంపీటీసీ శ్రీరాములు, టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతులయ్య, సుధాకర్‌చౌదరి, ముకుందనాయుడు, పతకమూరి అంజనేయులు, ఆనంద్, గోపాల్, మనోహర్‌నాయుడు, చైతు, రవి పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి


లైబ్రరీలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

అనంతపురం విద్య, ఆగస్టు 23: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పలు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నగరంలోని కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని వేడుకగా చేశారు. ఆయన చిత్రపటానికి కార్యదర్శి రమ, ఇతర ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఏపీ ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ఎంతగానో సేవ చేశారని వక్తలు కొనియాడారు. అలాగే సమగ్రశిక్ష ప్రాజక్టు కార్యాలయంలో టంగుటూరి జయంతిని ఘనంగా చేశారు. ప్రాజక్టు ఏపీసీ నాగరాజు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. 35 రోజుల పాటు బెంగళూరులో ఇచ్చే శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్ స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం నెలకు రూ.15వేల కనీస వేతనంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, ఆగస్టు 23: నగరంలోని ఆర్ట్స్ కళాశాల సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌పార్మర్ మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు పలు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ కోమల నాగవేణి తెలిపారు. శ్రీనివాసనగర్, కమలానగర్, ఆదిమూర్తినగర్, సుభాష్‌రోడ్డు, రాజు రోడ్డు, రామచంద్రనగర్, గుల్జార్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, రైల్వేస్టేషన్ ఏరియా, టవర్‌క్లాక్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 23: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వర్షం పడింది. పామిడిలో ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతపురం, శింగనమల, యాడికి, గార్లదిన్నె, నార్పల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

వైభవంగా కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ధర్మవరంరూరల్(కనగానపల్లి), ఆగస్టు 23: మండలంలోని భానుకోటలో కొల్లాపురమ్మ విగ్రహప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహదాతలు బాలకుళ్లాయప్ప, భక్తులకు అన్నదానం చేశారు.

పెద్దమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

శింగనమల, ఆగస్టు 23: మండలంలోని శివపురం పెద్దమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ శోభ తెలిపారు. శుక్రవారం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో 5 నెలలకు గాను రూ.40,260 వచ్చింది. కార్యక్రమంలో డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ జె.లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, అర్చకురాలు రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

27న పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: పవర్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుకుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపికైన వారు సెప్టెంబరు 14, 15న కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్త్రీ, పురుషులకు ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన తేదీ, ఆధార్ ధ్రువపత్రాలతో 27వ తేదీన అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 23: అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రక్తదానం, సర్జరీలు, రోగాల నివారణ తదితర అంశాల్లో రక్తనిర్ధారణ పరీక్షలు దోహదపడతాయని కళాశాల చైర్మన్ అనంతరాముడు అపాకపనేజ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఖలీల్‌బాషా, నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, డీన్‌లు రాయుడు, ప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్


జిల్లా కోర్టు ఆవరణలో శ్రీచైతన్య విద్యార్థులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23: మండలంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల పరిధిలోని సివిల్స్ బ్యాచ్ విద్యార్థులకు ఎడ్యుకేషన్ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. శుక్రవారం విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు కోర్టు ప్రాంగణాన్ని సందర్శించారు. అలాగే జిల్లా న్యాయాధికారి అనుమతితో కోర్టుహాలులోకి వెళ్లి కోర్టు ప్రొసీడింగ్స్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రిన్సిపాల్ హరిత, ఎస్‌బ్యాచ్ ఇన్‌చార్జి ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 23: హెచ్చెల్సీ కాలనీ వలీస్వామి ఆశ్రమ ఆవరణలోని కొల్హాపూర్ మహలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆశ్రమ కమిటీ నిర్వాహకుడు దేవనూరు సుందరం విజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 28న ఉదయం 7 గంటలకు దేవతామూర్తులకు అభిషేకాలు, 9 గంటలకు లక్ష్మీనారాయణ హోమం, 10 గంటలకు 11 మంది మహిళలచే లక్ష్మీశోభ, 10.45 గంటలకు 108 మంది మహిళలకు సామూహిక ఒడిబియ్యం, మధ్యాహ్నం 12.45 గంటలకు మహామంగళహారతి నివేదన, 1 గంటకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్మశానంలో కొత్తగా సమాధులు నిర్మించరాదు

నార్పల, ఆగస్టు 23: మండల కేంద్రంలోని హిందూ శ్మశానవాటికలో ఎవరూ కొత్తగా సమాధులు నిర్మించకూడదని ఎంపీడీఓ దివాకర్ అన్నారు. శుక్రవారం శ్మశాన వాటికను ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికలో ఇప్పటికే సమాధులు అధికంగా నిర్మించడంతో కొత్తగా మరణించిన వారిని పూడ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని, ఇకమీదట ఎవరూ సమాధులను నిర్మించకూడదని, అలా నిర్మిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడు పాల్గొన్నారు.

వంకలో పడి వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 23: మండల కేంద్రంలోని పెద్దవంకలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి మృతిచెందిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లికి చెందిన ఎరికల శీనప్ప(43)కు నాలుగునెలల క్రితం భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న ఈయన తాగుడుకు బానిసయ్యాడు. దీనికి తోడు మూర్ఛవ్యాధి కూడా ఉంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన స్థానిక పెద్ద వంకలో శవమై ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి అన్న గుర్రప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శీనప్పకు సంతానం లేదు.

బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రుణాలు

- లబ్ధిదారులకు రూ.40 లక్షల చెక్ అందజేసిన ఎమ్మెల్యే


లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఆగస్టు 23: ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా లబ్ధిదారులకు రూ.40 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో రూ.40 లక్షల మెగా చెక్‌ను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికపురోభివృద్ధి సాధించాలన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో అన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించి, ఆర్థికంగా చేయూతనిచ్చారన్నారు. గత వైసీపీ పాలనలో రాజకీయ నిరుద్యోగులతో కార్పొరేషన్లలో అలంకరించారని విమర్శించారు. కనీసం వారు కూర్చునేందుకు కుర్చీలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చిందని, కార్పొరేషన్ల ద్వారా అన్ని కులాలకు న్యాయం చేస్తామన్నారు. నాయకులు రాయల్ మురళి, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ మేనేజర్ బిందు, క్యాషియర్ నవ్యశ్రీ, ప్రసాద్‌రావు, రాఘవేంద్రరావు, విశ్వేశ్వరరావు, సంధ్యా, నరసింహారావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి..

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, ఆగస్టు 23: క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని కేఎస్ఆర్ హైస్కూల్, ఎస్ఎస్ఎబీఎన్ హైస్కూల్‌ను న్యాయాధికారి సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ఫండమెంటల్ రైట్స్, ఫండమెంటల్ డ్యూటీ గురించి అవగాహన కల్పించారు. వసతిగృహంలో వసతులు, ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం వసతిగృహాలు, వంటగది పరిశీలించారు. భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు 23: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆ వ్యాధి నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పాతూరులోని ఉమానగర్‌కు చెందిన కొండన్న కుమారుడు బండి రాజు (25) ఆస్తమా ఉండటంతో ఏ పని చేసేవాడు కాదు. అనారోగ్యం నయం కాకపోవడంతో గురువారం సాయంత్రం రామ్‌నగర్ మదర్‌థెరిస్సా స్కూల్ దగ్గరకెళ్లి విషద్రావకం తాగాడు. అనంతరం విషయాన్ని సోదరుడు పృథ్వికి ఫోన్ చేసి తెలిపాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ...


గుర్తుతెలియని మహిళ మృతదేహం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 23: మండలంలోని ఎన్ఎస్‌గేటు గ్రామం వద్ద రైల్వే పట్టాలపై ఓ గుర్తుతెలియని మహిళ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నసంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు మహిళకు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, అర్ధరాత్రి సమయంలో రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఆన్ డ్యూటీలో ఉన్న డ్రైవర్ గమనించి గూడ్స్‌రైలును ఆపివేశారు. రైలు పట్టాలపై తీవ్ర గాయాలతో పడి ఉన్న మహిళ గురించి స్థానిక గేటుమన్‌కు సమాచారం అందించారు. గేట్‌మన్ 108కు సమాచారం అందించడంతో తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ మహిళ శుక్రవారం మృతిచెందిందన్నారు. మృతురాలికి సంబంధించి ఆచూకీ తెలిసిన వారు 9440627641, 9441238182 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు. రైల్వే పోలీసులు కేసు చేసుకున్నారు.

బైకుల దొంగ అరెస్ట్

అనంతపురం క్రైం,ఆగస్టు 23: నాలుగో పట్టణ పోలీసులు ఓ బైక్ దొంగను అరెస్ట్ చేశారు. సీఐ సాయినాథ్, ఎస్ఐ నాగమధు బైక్ చోరీల నేపథ్యంలో నిఘా ఉంచారు. కంబదూరు మండలకేంద్రానికి చెందిన నరసింహులు సిండికేట్‌నగర్‌లో ఉండగా శుక్రవారం నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పెనుకొండ సీఐగా రాఘవన్

అనంతపురం క్రైం,ఆగస్టు 23: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సీఐగా రాఘవన్‌ను నియమించారు. కొన్ని రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. విజయవాడలో పనిచేస్తున్న ఈయనను తొలుత స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించారు. తాజాగా దానిని రద్దు చేస్తూ పెనుకొండ సీఐగా నియమించారు.

24 గంటల్లో సమస్యలు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ



గార్లదిన్నె: గ్రామసభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

గార్లదిన్నె, ఆగస్టు 23: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను 24 గంటల్లో పరిష్కారం అయ్యేల చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల అమోదం కోసం ప్రభుత్వం ఒక్కరోజు గ్రామ సభ నిర్వహించింది. శుక్రవారం మండలంలోని 18 పంచాయతీల్లో అధికారులు గ్రామ సభ్యులు నిర్వహించారు. గార్లదిన్నెలో నిర్వహించిన సభకు జేసీ, ట్రైనీ కలెక్టర్ వినూత్న, డీపీఓ ప్రభాకర్‌రావు హాజరయ్యారు. గ్రామంలో వీధిలైట్లు కాలిపోతే పట్టించుకోలేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. హెచ్ఎల్సీలో పూడిక తీయకపోవడంతో పంటలకు సాగునీరు రావాలంటే ఇబ్బందిగా ఉందని, కాలువల్లో పూడితతీత పనులు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో వీధిలైట్లు కాలిపోతే 24 గంటల్లో లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌నాయక్, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ విజయ్‌బాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ తారా చంద్రానాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా కూటమి ప్రభుత్వం
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అశోక్‌కుమార్

అనంతపురం సెంట్రల్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి జవాబుదారిగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొంది అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం రుద్రంపేట గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ పారదర్శక పాలనకు నిదర్శనంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల స్వంత్రతను కాలరాసిన జగన్మోహన్‌రెడ్డి కేంద్ర నిధులను సైతం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటుచేసిందని టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండుఓబుళేశు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం పనుల గుర్తింపుపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్,ఏఓ
23నార్పల1: ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

నార్పల: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ అశ్వత్థనాయుడు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు బొందలవాడ, గూగూడు, తదితర గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. నార్పలలో తాగునీటి సమస్య పరిష్కరించాని, డ్రైనేజీ నిర్మించాలని, వీధిలైట్లు, తదితర సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ గంజిగుంట రామకృష్ణ, అధికారులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

శింగనమల: పంచాయతీలు స్వయంసమృద్ధి సాధించాలన్న ధ్యేయంతో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ఎక్కడా చూసినా డ్రైనేజీ, సీసీ రోడ్లు, శ్మశాన వాటికలు, అంగన్‌వాడీలకు ప్రహరీ సమస్యలపై అధికారులకు గ్రామస్థులు విన్నవించారు. 19 పంచాయతీల్లో మండలస్థాయి అధికారులతో ఉపాధి పనుల గుర్తింపుపై ప్రజలు, ప్రజాపతినిధులు తీర్మానం చేశారు. గ్రామసభలో ఎక్కువగా గ్రామాల్లో ఆపరిశుభ్రతతోపాటు, ఉపాధి పనుల ద్వారా వ్యవసాయపనులు, సీసీ, మట్టిరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు వాటికి ప్రహరీ నిర్మాణాలు, ఇరిగేషన్ పనులు గుర్తించారు. డ్వామా పీడీ సుధాకర్‌రెడ్డి ఈఓఆర్డీ మురళీకృష్ణ, ఏపీఓ శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ సర్పంచులు దేగలలితమ్మ, రమేష్, నగమునేమ్మ, నల్లప్పరెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

రాప్తాడు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రాప్తాడులో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పశువుల, గొర్రెల షెడ్లు, పండ్ల తోటల పెంపకం, చెరువులు తదితర అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లోని ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, తహసీల్దార్ విజకుమారి, ఏపీడీ అనురాధ, కన్వీనర్ కొండప్ప, మాజీ కన్వీనర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని గ్రామాల్లో గ్రామ సభలు జోరుగా సాగాయి. ప్రతి గ్రామంలో సభ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, టీడీపీ నాయకులు గ్రామ సభల్లో పాల్గొని తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చారు.

ఆత్మకూరు: మండలంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలకు విశేష స్పందన వచ్చింది. గ్రామ పంచాయతీల్లో ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి అధికారులకు తమ సమస్యలు విన్నవించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులు తీర్మానాలు చేశారు. తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీటీసీ పారిజాతమ్మ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక చౌదరి పాల్గొన్నారు.


రుద్రంపేటలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్


శింగనమల: నాగులగుడ్డంలో సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు


రాప్తాడులో మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి


కురుగుంటలో అధికారులకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

పల్లె సమస్యల పరిష్కారానికి బాటలు

● గ్రామసభలో ప్రజా ప్రతినిధులు



గ్రామదట్ల గ్రామసభలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు



నక్కనదొడ్డి పంచాయతీ గ్రామ సభలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి



సంతేకొండాపురం గ్రామసభలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 23: వైసీపీ హయాంలో గ్రామపంచాయతీల అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అభివృద్ధికి బాటలు వేస్తున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. గ్రామదట్లలో శుక్రవారం సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఐదేళ్లలో రూ. 13 వేల కోట్ల నిధులను దారి మళ్లించారన్నారు. అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడునెలల కాలంలోనే 15వ ఆర్థిక సంఘం నిధులను రూ. 990 కోట్లు, జలజీవన్ మిషన్ కింద రూ. 550 కోట్లను పంచాయతీల ఖాతాల్లో జమ చేశామన్నారు. మొత్తం రూ.1540 కోట్లను గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత గ్రామస్థులు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ముఖ్యంగా అండర్ డ్రైనేజీల పనులను చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఎస్సీకాలనీవాసులకు దాదాపు 30 కుటుంబాలకు ఇళ్లస్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా గ్రామంలో సీసీరోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాలకు గ్రామసమైఖ్య భవనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రంగనాయకులు హౌసింగ్ డీఈ రంగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ సీనియర్ నాయకులు భీమసేనరావు, జింకుల గోవిందరెడ్డి, సోమశేఖర్, వీరే ష్, నాగరాజు, బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ సుంకన్న, గంగప్ప, నీల తదితరులు పాల్గొన్నారు. వేపరాలలో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ శంకర్, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించారు. ఇందులో అధికారులు 2024-25వ సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల గురించి ప్రజలతో చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీరోడ్ల ఏర్పాటుపై మాట్లాడారు. నక్కనదొడ్డి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు జయరాం, సర్పంచు, జనసేన నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామసభల్లో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, ఎంపీపీ మాధవి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రాయలరామయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పాలమల్లికార్జున, జనసేన నాయకుడు వాసగిరిమణికంఠ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, ఏపీఓ రామకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మండల ప్రజలు చాలా నష్టపోయారన్నారు. కరెంటు కష్టాలు వర్ణణాతీతమన్నారు. ప్రజా సమస్యలపై స్పందించే అధికారులనే నియమిస్తామన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. వంకలపై ఆక్రమణలు తొలగించి మరోసారి పామిడి పట్టణంను జలమయం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, టీడీపీ నాయకుడు ఆర్ఆర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరిగింది. గ్రామసభ అజెండాలోని అం శాలపై మండల ప్రత్యేక అధికారి కుష్బూ కొఠారి ప్రజలతో చర్చించారు. తర్వాత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజ లు సహకరించాలని కోరారు. అనంతరం పలువురు ప్రజలు కుళాయిల ద్వారా కలుషితనీరు వస్తున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు. స్థానిక శివరామిరెడ్డి కాలనీ, ఎస్ఎల్ఎన్ కాలనీ, పాతపేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని టీడీపీ వార్డు మద్దతుదారులు ఈవోఆర్డీ చంద్రమౌళికి విన్నవించారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరారు. అలాగే వజ్రకరూరు మండలంలోని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చేపట్టాలని ప్రజలు అధికారులను కోరారు. ఉపాధి పథకం పొలం గట్లు పనులు చేపట్టాలని ప్యాపిలి, కడమలకుంట గ్రామాల రైతులు కోరారు.

విడపనకల్లు: మండంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ప్రజలు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు సునితాబాయి, ఏపీఓ సంజీవ, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 15 పంచాయతీలలో అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు గ్రామసభలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, మట్టిరోడ్లు, డ్రైనేజీలు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి సకాలంలో పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ,అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల అధ్యక్షతన సువర్ణ గ్రామసభలు జరిగాయి. ఇందులో ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాలుగు నెలలుగా ఉపాధి బిల్లులు మంజూరుకాలేదని బెళుగుప్పకు చెందిన కూలీలు గ్రామసభలో వాపోయారు. వర్షం వస్తే ఎర్రగుడిలో పొలాల్లోకి వెళ్లడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారని, పెద్ద వంకకు కల్వర్టు నిర్మించాలని ఆ గ్రామస్థులు విన్నవించారు. సర్పంచ్‌లు, ప్రత్యేకాధికారి షేక్ షఫీ, ఎంపీడీవో రామచంద్ర, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ అధికారులు గ్రామసభలను నిర్వహించారు. గ్రామాలలో కావాల్సిన మౌలిక వసతులు గురించి ప్రజలతో చర్చించారు. శెట్టూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గ్రామాలలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేయడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామారావు, ఏపీవో నీరజ, మండల టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు గ్రామాల ప్రజలు ఎక్కువ శాతం రోడ్లు, డ్రైనేజీలు సౌకర్యం, శ్మశానవాటిక ఏర్పాటు, చెరువులో పూడికతీత పనులు తదితరాలపై నివేదికలను తయారు చేసి అధికారులకు వివరించారు. మండల కేంద్రంలోని గ్రామసభలో తహసీల్దార్ శ్రీనివాసులు , ఎర్రగుంట పంచాయతీలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ప్రత్యేకాధికారిణి సురేఖ, కరిగానపల్లెలో డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి ఆయా గ్రామ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సభలో తహశీల్దార్ ఫణికుమార్ మాట్లాడారు. ప్రజల ద్వారా సమస్యలపై అర్జీలు స్వీ కరించి వాటిని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గూడెన్న, సర్పంచ్ నిర్మల, ఈఓ ప్రసాద్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, చంద్రశేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని 19 గ్రామపంచాయతీలలో గ్రామసభలను నిర్వహించారు. ప్రతి గ్రామంలో పం డగ వాతావరణం కనిపించింది. ప్రజలు భారీగా పాల్గొని తమ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనులకు తీర్మానాల చేసుకొని ఆమోదించుకున్నారు. గోవిందవాడ గ్రామానికి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానిక టీడీపీ యూత్ నాయకుడు సోమనాథ్‌గౌడ్ కోరారు. శీదరఘట్ట గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. దేవగిరి, ఉంతకల్లు, గోనేహాళ్ తదితర గ్రామాలలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, పొలాలకు మట్టి రోడ్లు వేయాలని ఆయా గ్రామస్థులు కోరారు. నేమకల్లులో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్, ఏపీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంతో పాటు వేపులపర్తి, భైరసముద్రం, సంతేకొండాపురం, పాల వెంకటాపురం గ్రామాల్లో గ్రామసభలు సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగాయి. ఈ సభలకు ముఖ్య అతిథిగా టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేసి ఏకకాలంలో ఇన్ని గ్రామసభలు నిర్వహించడం దేశంలో తొలిసారి అన్నారు. అనంతరం గ్రామస్థులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ అధికారులు, గ్రామస్థులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: 16 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఇందులో గ్రామాల్లో చేపట్టాల్సిన పలు పనుల గురించి ప్రజలు అధికారులకు తెలిపారు. ముఖ్యంగా సీసీరోడ్లు, డ్రైనేజీలు తదితరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీఓ రఘునాథ్, తహసీల్దార్ అనిల్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతోపాటు శ్మశాన వాటికలకు కాంపౌండ్ వాల్, పొలాల్లోకి వెళ్లే దారులను ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరారు. ఆయా సభల్లో ఉరవకొండ నియోజక వర్గ స్పెషలాఫీసర్, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, మండల స్పెషలాఫీసర్ సత్యనారాయణ చౌదరి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాడికి: గ్రామ సభలలో లక్ష్యాన్ని అధికారులు గ్రామస్థులకు వివరించారు. మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచు అనురాధ పాల్గొన్నారు. పలు కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. అలాగే ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల కోసం ప్రజలు అధికారులకు నివేదికలు సమర్పించారు. సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెద్దారెడ్డి అక్రమాలు లెక్కలేనివి

● విరుచుకుపడ్డ టీడీపీ మహిళా కౌన్సిలర్లు

తాడిపత్రి, ఆగస్టు23: వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై టీడీపీ మహిళా కౌన్సిలర్లు జింకా లక్ష్మీదేవి, రేష్మాపర్వీన్, సరస్వతి, అరుణలు విరుచుకుపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణ లో శుక్రవారం మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దారెడ్డి చేసిన అన్యాయాలు, అక్రమాలు లెక్కలేనివన్నారు. అప్పటి ప్రభుత్వం అవినీతిపై గళం విప్పినందుకు కేసులు పెట్టించడం దారుణమన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా తమపై 307 కేసులు పెట్టించిన ఘనత పెద్దారెడ్డికే దక్కిందన్నారు. ఇలాంటి వ్యక్తికి మద్ధతుగా నిలిచి జిల్లా వైసీపీ నేతలు ఎస్పీ జగదీష్‌ను కలిసి తాడిపత్రికి రానివ్వడం లేదంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పట్లో టీడీపీ నేతలపై అక్రమకేసులు పెట్టడం మరిచిపోయారా అంటూ మండిపడ్డారు. న్యాయం ఎటువైపు ఉంటే అక్కడ జిల్లా వైసీపీ నేతలు ఉండాలని తెలిపారు. లేకపోతే ఈనెల 29న పెద్దారెడ్డికి మద్ధతుగా నిలిచిన నాయకుల ఇళ్లవద్ద మౌనదీక్ష చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు పనులను కల్పించాలి

తాడిపత్రి, ఆగస్టు 23: ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలని కోరుతూ మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు ఉపయోగపడే పనులను గుర్తించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. కేవలం గుంతలు తవ్వడానికే ఉపాధి పనులను పరిమితం చేస్తున్నారన్నారు. ఉపాధిహామీ చట్టంలో ఏ పనులు ఉన్నాయో వాటిని అమలుచేయాలన్నారు. జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి 200రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు నారాయణరెడ్డి, రామాంజనేయులు, ఓబులేసు, చిన్నకుల్లాయప్ప, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

పెద్దవడుగూరు, ఆగస్టు 23: ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతు ఆదిరెడ్డి కోరారు. మండలంలోని చింతలచెరువు గ్రామంలో శుక్రవారం జరిగిన మన పంచాయతీ మన గ్రామ సాధికారిక సభలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలం చేయడం వల్ల రైతులకు ఆర్థికభారం తగ్గుతుందన్నారు. అలాగే గ్రామాల్లో డ్రైనేజీ, సీసీరోడ్లు, నీటి సౌకర్యాలను మెరుగు పరచాలని ఆయన అధికారులను కోరారు.

బోగస్ పింఛన్లపై ఫిర్యాదు

యల్లనూరు, ఆగస్టు23: మండలకేంద్రంలో బోగస్ పింఛన్లపై శుక్రవారం టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలోని ఆర్డీటీ భవనంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా కొందరు అంగవైకల్యం లేకున్నా.. బోగస్ సర్టిఫికెట్ల ద్వారా వికలాంగ పింఛన్లను పొందుతున్నారని, వాటిపై విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వైసీపీ పాలనలో వలంటీర్లు సర్టిఫికెట్‌కు రూ.30వేలు తీసుకొని ఒకే ఇంటిలో రెండుమూడు అంగవైకల్యం సర్టిఫికెట్లను ఇప్పించి పింఛన్ మంజూరు చేయించారని పేర్కొన్నారు ఇలాంటి వాటిపై విచారించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, ఆగస్టు 23: పట్టణ సమీపంలోని అనంతపురం ఫ్లైఓవర్ సమీపంలో గల పాత బడ్డ బండల ఫ్యాక్టరీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని శుక్రవారం రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతుడు టీషర్ట్, ప్యాంట్ ధరించాడని, వయస్సు 45 నుంచి 50సంవత్సరాలలోపు ఉంటుందని తెలిపారు. ఐదురోజుల క్రితం ఉరి వేసుకొని ఉండవచ్చునని సీఐ తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాల అందజేత

గుంతకల్లుటౌన్, ఆగస్టు 23: మండలంలోని నాగసముద్రం ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలను మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి నవీన్‌బాబు అంజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి సర్వే నిర్వహించామన్నారు. అనుమానాస్పద కేసులను గుర్తించి వారికి పునరావాస, సహాయక చర్యలు చేపట్టామని, ఈ క్రమంలో నడుము బెల్టులు, మెడకు బెల్టులు, వాకర్ స్టిక్‌లను అందించామని తెలిపారు. ఫ్లోరైడ్ నివారణకు ఆహారపదార్థాలు ఏవి తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సీహెచ్‌ఓ హైమావతి, హెల్త్ అసిస్టెంట్ జాకీర్ హుసేన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

ఉరవకొండ, ఆగస్టు 23: సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడదామని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని షిర్డీసాయి కల్యాణమండపంలో శుక్రవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అపరిమిత ఉచిత వైద్య సదుపాయాన్ని అమలు చేయాలన్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తబస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగరాజు, జోనల్‌అధ్యక్షుడు చెన్నారెడ్డి, జిల్లా చైర్మన్ సూరిబాబు, జిల్లాకార్యదర్శి ప్రతాప్, డిపో అధ్యక్షులు ఎర్రిస్వామి, కార్యదర్శి నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఇల్లు ఖాళీ చేయలేదని సామగ్రి ధ్వంసం

గుంతకల్లుటౌన్, ఆగస్టు23: పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న పార్వతి అనే మహిళ ఇల్లు ఖాళీ చేయలేదని అమరేంద్ర రెడ్డి , అతని అనుచరులు శుక్రవారం సాయంత్రం ఆ ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. బాధితురాలు పార్వతి, అతని సోదరుడు దేవానందకుమార్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన పార్వతికి పట్టణానికి చెందిన మురళికి 2020లో వివాహమైంది. వారు విద్యానగర్‌లో ఇంటిని నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. కాగా మురళి భార్య పార్వతికి తెలియకుండా ఇంటిని స్నేహితుడు నవీన్‌కు విక్రయించాడు. అయితే నవీన్ తన స్నేహితుడు అమరేంద్రరెడ్డికి విక్రయించాడు. ఇంటిలో పార్వతి నివాసం ఉంటోంది. దీంతో ఇల్లు ఖాళీ చేయాలని పలుమార్లు అమరేంద్రరెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె ఖాళీ చేయక పోవడంతో శుక్రవారం సాయంత్రం వచ్చి ఇంట్లో సామగ్రిని బయటికి విసిరి ధ్వంసం చేశారు. అలాగే ఇంట్లో ఉన్న 5తులాల బంగారు నగలు, రూ.లక్ష రుపాయాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అమరేంద్ర రెడ్డి ఇంటిని ప్రతాప్‌కు రిజిస్టర్ ఆయికం చేయించాడు. ఇల్లు ఖాళీ చేయించి తాముకు ఇవ్వాలని అమరేంద్ర రెడ్డితో ప్రతాప్,దేవేంద్రలు గొడవపడ్డారు. తనపై ప్రతాప్,దేవేంద్రలు దాడి చేసి గాయపరిచినట్లు అమరేంద్రరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఇంట్లోని సామగ్రిని బయట పడేసిన దృశ్యం

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



తిమ్మాపురం గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు

కళ్యాణదుర్గం (కంబదూరు), ఆగస్టు 23: కంబదూరు మండలం తిమ్మాపురం గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తూ నానా ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు తీర్చాలని కోరుతూ పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాలలో తాగునీరు కూడా లేదని, దీంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. చదువు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రతి ఒక్కరూ టీసీలు తీసుకుని వెళుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ దురుసు ప్రవర్తన కారణంగా ఇక్కడ ఉపాధ్యాయులు పనిచేసేందుకు సాహసించలేక బదిలీపై వెళుతున్నారన్నారు. దీంతో ఇక్కడ విద్యావ్యవస్థ కుంటుపడిందంటున్నారు. పలు సమస్యలతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని వాపోయారు. ఈ పాఠశాలలో సమస్యలపై కలెక్టర్‌కు కూడా విన్నవించామన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్సీఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు బాబా రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

బెళుగుప్ప, ఆగస్టు 23 : మండలంలోని ఎర్రగుడిలో వర్షానికి పైపులు కొట్టుకుపోవడంతో మూడు రోజుల నుంచి తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్థుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని పయ్యావుల సోదరుల స్ఫూర్తితో స్థానిక టీడీపీ నాయకులు దబ్బార లక్ష్మీనారాయణ ట్యాంకర్ ఏర్పాటు చేసి తాగునీరు అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, చిరంజీవి, రాజన్న, అశోక్, యర్రిస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

గుత్తిరూరల్, ఆగస్టు 23: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం గర్భిణులకు టీడీపీ నాయకులు అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే జయరాం సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే జయరాం మాతృమూర్తి జ్ఞాపకార్థం ప్రతి శుక్రవారం ఆస్పత్రిలో గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బర్దీవలి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావైద్యశాల తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

రాయదుర్గం రూరల్, ఆగస్టు 23: పట్టణంలోని ప్రజా వైద్యశాలను జిల్లా డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులకు బదులుగా సెక్యూరిటీ గార్డులే వైద్యం నిర్వహిస్తున్నారన్న విషయంపై విచారణ చేసేందుకు వచ్చామన్నారు. సెక్యూరిటీ గార్డుపై తగుచర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవిని ఆదేశించారు. అలాగే వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. వైద్యశాలలో ఉన్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యశాలలో వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించకుండా ప్రైవేట్ వైద్యశాలలకే పరిమతమవుతున్నారని, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారని, చిన్న చిన్న రోగాలను కూడా చూడకుండా బళ్లారి, అనంతపురం నగరాలకు రెఫర్ చేస్తున్నారని తన దృష్టికి తెచ్చారని, ప్రైవేట్ అంబులెన్స్‌లు, ప్రైవేట్ వ్యక్తులతో డాక్టర్లు కుమ్మక్కై కమీషన్ల కోసం కక్కుర్తి పడి రోగులకు వైద్యం నిర్వహించడంలో అలసత్వం వహిస్తున్నారని చెప్పారని జిల్లా అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన విచారణలో ఇక్కడ సెక్యూరిటీ గార్డు వైద్యం నిర్వహించడం వాస్తవమేనని తేలిందన్నారు. ఈ విషయాలపై విచారించి బాధ్యులపై రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ సెక్రెటరీ వైద్య అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాంతాల్లో గోడలను తొలగించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 23: పట్టణంలో రైల్వే ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా రహదారిలో నిర్మించిన గోడలను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విద్యార్థులతో కలిసి స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి రైల్వే డీఆర్ఎం కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే ప్రాంతాల్లో ప్రవేశించకుండా రైల్వే అధికారులు గోడలను నిర్మించారని, దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైల్వే అధికారులు వెంటనే గోడలను తొలగింలన్నారు. లేని పక్షంలో ప్రజా సంఘాలు, విద్యార్థులు, ప్రజలతో కలసి మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం వినతి పత్రం ఇవ్వగా తీసుకోవడానికి రైల్వే అధికారులు వెనకడుగు వేశారు. దీంతో గోడకు వినతి పత్రాన్ని ఇచ్చారు. సీపీఎం నాయకులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, సాకేనాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎన్‌సీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంరూరల్, ఆగస్టు 28: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30 నుంచి కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్(సీఎన్‌సీ) ప్రోగ్రామింగ్ అనే నూతన కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కోర్సులో చేరేందుకు ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు ఫీజు రూ. 1500 గా నిర్ణయించామన్నారు. వివరాలకు 9898400832ను సంప్రదించాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



బొమ్మనహాల్‌లో మానవహారంగా విద్యార్థులు



ఉరవకొండలో ర్యాలీ ..

బొమ్మనహాళ్, ఆగస్టు 23 : కలకతాలోని జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మనహాళ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, వైద్యాధికారి మల్లేశ్వరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విద్యార్థులతో కలిసి ఈమేరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టి అనంతరం బళ్లారి - కళ్యాణదుర్గం రహదారిపై మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంతనాయక్, సుబ్బరాయుడు, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, జైనబీ, ఆర్డీటీ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మహిళలపై దాడులు, హత్యాచారాలను అరికట్టాలని ఆర్డీటీ ఏటీఎల్ నల్లప్పరెడ్డి కోరారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యను నిరసిస్తూ పట్టణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆయన విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం టవర్ క్లాక్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవోకు తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం, ఆగస్టు 23: మండలంలోని గోళ్ల గ్రామసమీపంలో ఎంఈవో విజయకుమారి కారు శుక్రవారం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఎంఈవో స్వల్ప గాయాలతో బయటపడగా కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. అనంతపురం నుంచి కళ్యాణదుర్గంకు వస్తున్న సమయంలో గోళ్ల గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న మట్టి కుప్పకు కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. పోలీసులు విచారించి కేసు నమోదు చేసుకున్నారు.



ధ్వంసమైన కారు

శిక్షణ ప్రారంభం

విడపనకల్లు, ఆగస్టు 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు వ్యక్తిగత నైపుణ్యాలపై ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్‌లో ఉచిత శిక్షణను మూడు నెలలు పాటు ఇస్తామన్నారు. మండల కేంద్రంలో 40 మంది మహిళలకు శిక్షణ ఇస్తామని, వారిని రెండు బ్యాచ్‌లుగా చేసి ఉదయం ఒక బ్యాచ్‌కు, సాయంత్రం మరో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మ కంగా ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఇలాంటి కోర్సులు చేయాలంటే దాదాపుగా రూ. 20 నుంచి 30 వేలు ఖర్చు అయ్యేదన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మహిళలు ఆర్థికంగా ఎదగ టానికి నైపుణ్యం కోర్సులను ఉచితంగా నేర్పుతోంది అన్నారు. ఇటు వంటి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జన శిక్షణా సంస్థ పీడీ రషీద్, సూపర్ వైజర్ ఉమారాణి, సర్పంచ్ చంద్రశేఖర్ హెచ్ఎం శీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

రుద్రాక్షల సుంకన్న, S/o ఆర్.పి మారెన్న, D.No.18/775-4C, కథలగేరి, తిలక్‌నగర్, గుంతకల్లు వారికి సంబంధించిన ఆస్తి గుంతకల్లులో తిమ్మనచెర్ల గ్రామ పొలంలో సర్వే నెం.187 ఏ1బి1లో కథలగేరి రెసిడెన్షియల్ ఏరియాలో 62.22 గజాల స్థలంలోD.No. 18/775-4-2 గల ఇంటిని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తిపైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నయెడల గుంతకల్లు శ్రీరామ్ చిట్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు. హద్దులు:- తూర్పు: మాధవిగారి ఇల్లు, పడమర: జి రామలింగ గారి ఇల్లు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: సందు రస్తా.

M.G. భాస్కర్‌గౌడ్, అడ్వకేట్, గుంతకల్లు

ప్రకటన

కె.షాకీరాబీ, W/o కె.బషీర్ అహ్మద్, D.No.11/343, రాచప్పబావి వీధి, కళ్యాణదుర్గం. అనంతపురం జిల్లా. Doc.No.3136/2011, సర్వేనెం. 372-2 ఏ1బిలో ఇల్లును శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపల రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు. హద్దులు:- తూర్పు బాబు నుండి ఈడిగ నాగమ్మ విక్రయించుకున్న ఇల్లు, పడమర మాయొక్క మిగిలిన ఇల్లు, ఉత్తరం ఇల్లూరు నబీసాబ్ ఇల్లు, దక్షిణం రస్తా.

K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం

ప్రకటన

కె అజీమ్ బేగ్, S/o లేట్ బాబుబేగ్, D.No.3-1-54,గోల్డ్ స్మిత్ స్ట్రీట్, రాయదుర్గం అనంతపురం జిల్లా. Doc.No.2488/2008, రాయదుర్గం పట్టణం, D.No.3-1-52, లోని బయలు స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు. హద్దులు:- తూర్పు నీయొక్క, మరియు మాయొక్క జాయింట్‌గా ఉన్న ఇల్లు, పడమర రస్తా, ఉత్తరం H.K. షర్పుద్దీన్‌గారి ఇల్లు, దక్షిణం రస్తా.

K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం

ప్రకటన

రాయచూర్ హమాద్ బాషా S/o రాయచూర్ వలీబాష, R.షాకీరాబేగం W/o R.హమాద్‌బాషా, D.No.6-395, సంజయ్‌నగర్ రోడ్డు, కణేకల్ గ్రామం & మం, అనంతపురం జిల్లా. Doc. No 652/ 2020, 3061/ 2020 సర్వే నెం.524-AB లో ప్లాట్ నెం.88, 617- 14లో ప్లాట్ నెం. 44లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.

సర్వే నెం.524-ఎబి ప్లాట్ నంబరు 88హద్దులు

తూర్పు:20అడుగుల రోడ్డు,పడమర :రోడ్డు, ఉత్తరం:జట్టి ఫాతిమాకు విక్రయించిన ప్లాట్ నెం.89, దక్షిణం:కె.హీరాలాల్‌కు విక్రయించిన ప్లాట్ నెం.86.

సర్వే నంబరు 617-14లో ప్లాట్ నెం.44హద్దులు

తూర్పు:ఇదే సర్వే నెం. 30అడుగుల రోడ్డు, పడమర:ప్లాట్‌నెం.45, ఉత్తరం:ప్లాట్ నెం.53, దక్షిణం :20 అడుగుల వెడల్పు గల రోడ్డు.

K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం